కొత్త పింఛన్లతో ఆసరా

- 34వ వార్డులో 87 మందికి మంజూరు
- 50 ఏళ్లు దాటిన మత్స్యకారులకు కూడా..
- పెద్ద కొడుకులా ఆదుకుంటున్నాడని సీఎం జగన్‌కు లబ్ధిదారుల మన్నన


లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్లు అందజేస్తున్న 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి

అల్లిపురం: అర్హులైన ప్రతి ఒక్కరికీ అభయహస్తం అందజేస్తూ ముఖ్యమంత్రి జగన్ కుటుంబ సభ్యుల్లో ఒకరిగా మారిపోయారని రాష్ట్రంలో ఎంతో మంది లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అవ్వాతాతలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు.. ఇలా అన్ని వర్గాల వారికీ పింఛన్లు అందజేస్తూ ప్రతి ఇంట ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద కొడుకుగా మన్ననలు అందుకుంటున్నారు. సెప్టెంబర్‌లో 34వ వార్డులో 87 కొత్త పింఛన్లు మంజూరు చేశారు. భూపేష్‌నగర్ సచివాలయం పరిధిలో 15, యాతపేటలో 16, కొబ్బరితోట–1 సచివాలయంలో 20, కొబ్బరితోట–2 సచివాలయంలో 19, అచ్చియ్యమ్మపేట సచివాయం పరిధిలో 17 కొత్త పింఛన్లు మంజూరు అయ్యాయి. అలాగే 50 సంవత్సరాలు దాటిన మత్స్యకారులకు కూడా పింఛన్లు మంజూరు చేశారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో కాళ్లరిగేలా జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణ చేసినా రాని పింఛన్ ఇప్పుడు సీఎం జగన్ చలవతో నేరుగా ఇంటికే వస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వలంటీర్ వ్యవస్థ వల్ల తాము ఎక్కడికీ కదలకుండా ఇంటి వద్ద ఉండే దరఖాస్తు చేసుకుంటే వలంటీర్లే అన్నీ చూసుకుంటున్నారని చెబుతున్నారు. ప్రతి నెల క్రమం తప్పకుండా ఒకటో తేదీన తెల్లవారే ఇంటి తలుపు తట్టి అవ్వాతాత, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమేనని హర్షం వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లను నియమించి ప్రజల బాగోగులు పర్యవేక్షిస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రమేనని లబ్ధిదారులు పొగుడుతున్నారు. అతడి రుణం తీర్చుకోలేమని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారు. గత నాలుగేళ్లుగా వార్డు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ప్రజల వద్దకే పాలనను విజయవంతంగా తీసుకెళ్లారు. ప్రజల అవసరాలు తెలుసుకుని ఎప్పటికప్పుడు సరికొత్త పథకాల ద్వారా వాటిని తీరుస్తున్న ముఖ్యమంత్రి జగన్ ప్రతి ఇంట్లో ఒక సభ్యుడిగా మారిపోయారు. వార్డు అభివృద్ధికి మరింత కృషి చేస్తున్నాను.
– తోట పద్మావతి, కార్పొరేటర్, 34వ వార్డు

ఆనందంగా ఉంది


కొత్త పింఛన్‌తో నాకు ఆసరా దొరికింది. నేను ఎక్కడికీ వెళ్లకుండా వలంటీరే మా ఇంటికి వచ్చి దరఖాస్తు చేయించారు. నాకు దివ్యాంగ పింఛన్ వచ్చేలా కృషి చేశారు. చాలా ఆనందంగా ఉంది.
– బొడ్డు దుర్గారావు, భూపేష్‌నగర్

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు


మాలాంటి వారికి అండగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. వృద్ధులు, వితంతువులకు ఇంటి వద్దకే పింఛన్ తీసుకొచ్చి అందజేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ సుపరిపాలనకు ఇదొక ఉదాహరణ.
–దాసరి రాజమ్మ, జెండాచెట్టు

వితంతువులకు అండ


వితంతు అయిన నేను ఆర్థికంగా ఇబ్బంది పడేదానిని. అటువంటి సమయంలో వలంటీర్ నా వివరాలు సేకరించి పింఛన్ మంజూరు చేయించారు. ఇప్పుడు నాకు నెలనెలా పింఛన్ వస్తూ ఆర్థికంగా అండ దొరికినట్టయింది.
– దాసరి రత్నం, జెండాచెట్టు

క్లుప్తంగా

ఎర్నిమాంబకు విశేషార్చనలు


పూజలందుకుంటున్న అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ శాఖ ఈవో డి.వి.ఎస్.సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దేవదాయ శాఖ, ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50ల కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటా వార్పు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇష్టంగా చదవండి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి రాజు

అల్లిపురం: పిల్లలు పుస్తకాలను ఇష్టంగా చదవాలని గ్రంథాలయాధికారి పి.వి.ఎన్.రాజు సూచించారు. వుయ్ లవ్ రీడింగ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం అల్లిపురం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథలు పుస్తకాలు, వాటి విశిష్టత గురించి వివరించారు. లైబ్రరీలోని ప్రతి పుస్తకం ఒక చరిత్రను తెలియజేస్తుందని చెప్పారు. తమకు కావాల్సిన విజ్ఞానాన్ని గ్రంథాలయం ద్వారా సముపార్జించాలని పిల్లలకు సూచించారు. కార్యక్రమంలో పాఠకులు రిటైర్డ్ రైల్వే ఉద్యోగి భాస్కర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువకులు

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెంలోని రాక్‌డేల్ స్కూల్‌లో జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్‌నేషనల్(జేసీఐ) విశాఖ ఫ్రైడ్, మదర్ బ్లడ్‌బ్యాంక్‌లు సంయుక్తంగా ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఈ సందర్భంగా పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ పి.మల్లికార్జునరావు మాట్లాడుతూ తన తండ్రి పి.నారాయణమూర్తి 68వ జయంతిని పురస్కరించుకుని జేసీఐ, మదర్ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పలువురు యువకుల నుంచి సుమారు 80 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చందు, సత్యనారాయణ, ప్రదీప్, లక్ష్మణ్, రాజశేఖర్, నవ్య, శివగుప్తా, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రం తనిఖీ


మూల్యాంకన విధానం పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో కేంద్రీయ మూల్యాంకన కేంద్రాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆచార్యుల హాజరు, మూల్యాంకనం జరుగుతున్న విధానం ప్రత్యక్షంగా పరిశీలించారు. సెలవు రోజున సైతం ఆచార్యులు పూర్తిస్థాయిలో హాజరై పటిష్టంగా మూల్యాంకన ప్రక్రియను నిర్వహించడంపై సంతోషం వ్యక్తం చేశారు. మూల్యాంకన కేంద్రం అధికారులను ఈ సందర్భంగా అభినందించారు. మూల్యాంకన ప్రక్రియలో పాల్గొన్న ఆచార్యులతో ఆయన మాట్లాడారు.

ఘనంగా రోటరీ పబ్లిక్ ఇమేజ్ సదస్సు


సదస్సును ప్రారంభిస్తున్న రోటరీ ప్రతినిధులు

ఏయూక్యాంపస్: రోటరీ క్లబ్ సామాజిక సేవా కార్యక్రమాలపై ఆదివారం ఒక హోటల్‌లో సదస్సు నిర్వహించారు. ప్రజల్లో సంతృప్తికరమైన భావాలను పెంపొందించే దిశగా సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణపై దీనిలో చర్చించారు. సదస్సును రోటరీ ప్రతినిధులు ప్రారంభించారు. అనంతరం రోటరీ క్లబ్ లు చేస్తున్న ప్రజా సేవా కార్యక్రమాలను విశాఖపట్నం రొటేరియన్ కిషోర్ కుమార్, నేతాజీ, వర్మరాజు వివరించారు. విజయవాడ రోటరీ జిల్లా గవర్నర్ రొటేరియన్ రావూరి సుబ్బారావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రోటరీ సేవల ప్రచారంలో అనుసరించాల్సిన వివిధ అంశాలను వివరించారు.ఆతిథ్యం వహించిన ఆ రోటరీక్లబ్ గ్రేటర్ విశాఖ అధ్యక్షులు పి.నాగరాజు మాట్లాడుతూ విశాఖనగరంలో జీవీఎంసీ పశువుల ప్రాంగణంలో ఉన్న ఆవులు, కుక్కలు వగైరాలకు ఆహారం అందిస్తున్నామని చెప్పారు. నగరంలోని ఒక మానసిక వికలాంగుల పాఠశాలకు సహకారం అందిస్తున్నారన్నారు. రక్తదాన శిబిరాల ద్వారా త్వరలో 400 యూనిట్ల రక్తం సేకరించబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

మురళీనగర్: మహాకవి గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ బాలికల హాస్టల్‌లో సాహితీ స్రవంతి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పోటీలు నిర్వహించారు. గురజాడ తెలుగు భాషకు చేసిన సేవలపై ఏర్పాటు చేసిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ బి.వి.లక్ష్మణరావు, హాస్టల్ వార్డెన్ భూదానమ్మ పాల్గొన్నారు.

కూచిపూడి కళాక్షేత్రం ప్రిన్సిపాల్‌కు సత్కారం


రామ్మూర్తిని దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: కూచిపూడి కళాక్షేత్రం ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని గ్రాయత్రి విద్యాపరిషత్ లో జరిగిన ఈ కార్యక్రమంలో కూచిపూడి కళాక్షేత్రం ప్రిన్సిపాల్ గురు హరే రామ్మూర్తిని విద్యార్థు లు సత్కరించడంతో పాటు పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడు తూ వేల మంది విద్యార్థులు కూచిపూడిలో శిక్షణ అందించడంతో పాటు సంస్కృతి, సంప్రదాల విశిష్టతను తెలియజేశారని కొనియాడారు. అనంతరం రామ్మూర్తి, ఆయన సతీమణి సత్యభామల షష్టిపూర్తి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయ నిర్మాణ్ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సూరపనేని విజయకుమార్, విశాఖ మ్యూజిక్ అకాడమీ జనరల్ సెక్రటరీ ఎంఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూచిపూడి కళాక్షేత్రంలో శిక్షణ పొందిన విద్యార్థుల సాంస్కృతిక, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

వైద్య వ్యవస్థలో ఫార్మాసిస్టులు కీలకం


ర్యాలీ ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: వైద్య వ్యవస్థలో ఫార్మాసిస్టులు కీలకమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. వరల్డ్ ఫార్మాసిస్టుల డేను పురస్కరించుకుని ఏయూ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఆర్‌కే బీచ్ నుంచి వైఎంసీఏ కూడలి వరకు ఏయూ ఫార్మసీ విద్యార్థులు, ఆచార్యులు ప్లకార్డులు పట్టుకుని సమాజంలో ఫార్మసిస్టుల ఆవశ్యకతను, వారి సేవలను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించిన కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జబర్దస్త్ టీమ్ ఫన్ షో


ప్రేక్షకులను నవ్విస్తున్న జబర్దస్త్ టీమ్ నూకరాజు, వినోద్, ప్రవీణ్

మల్కాపురం: వినాయక నవరాత్రుల సందర్భంగా శ్రీహరిపురం గణేష్ మందిరం వద్ద ఆదివారం నిర్వాహకులు ఏర్పాటు చేసిన వినోద కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. జబర్దస్త్ షోలో నటించిన బుల్లితెర నటులు వినోద్, నూకరాజు, ప్రవీణ్, యాంకర్ రూస్సీ(పల్సర్ బైక్) తదితరులు డ్యాన్స్‌లు, పంచ్ డైలాగ్‌లతో అలరించారు. ఇబ్బందులు తలెత్తకుండా మల్కాపురం పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు.

శ్రావ్యంగా గాత్ర కచేరి



కచేరి చేస్తున్న వసుధ రవి

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం గాత్ర సంగీత విద్వాంసురాలు వసుధ రవి గాత్ర కచేరి శ్రావ్యంగా సాగింది. ఈ కార్యక్రమాన్ని రాజారావు, పేరాల బాలమురళి ప్రారంభించారు. అనంతరం వసుధా రవి తన గాత్రంతో ఖమాస్ రాగంలో, సిద్ధివినాయకం, నన్ను బ్రోవు తదితర కీర్తనలను ఆలపించారు.

భారీ అన్నసమారాధన


అన్నసమారాధన చేస్తున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి వెంకటరాజునగర్‌లో సంపత్ యూత్ బాయ్స్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నసమారాధనను జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో వేశంగిణి రాజు, కన్వీనర్లు అన్నపూర్ణ, దేవి, ఈశ్వరి, చుక్క శ్యామ్ సుందర్‌రెడ్డి, శ్రీనివాస్, అమలావతి, సంఘం సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్ సీఆర్ రావు దేశానికే గర్వకారణం


సీఆర్ రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెక్టార్ సమత, కృష్ణమోహన్ తదితరులు

ఏయూక్యాంపస్: భారతదేశం గర్వించే వ్యక్తిగా ఆచార్య సీఆర్‌రావు ఎదిగారని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. ఏయూ స్టాటస్టిక్స్ విభాగంలో నిర్వహించిన డాక్టర్ సీఆర్ రావు ఎండోమెంట్ లెక్చర్‌ను ఆమె ప్రారంభించారు. ముందుగా ఆచార్య సీఆర్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిగా ఆయన వర్సిటీ చరిత్రలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని నేటి తరం యువత ఉన్నతంగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు, విభాగాధిపతి ఆచార్య బి.మునిస్వామి తదితరులు ప్రసంగించారు. డాక్టర్ సి.ఆర్ రావు వద్ద విద్యనభ్యశించి ప్రస్తుతం కాలిఫోర్నియా యూనివర్సిటీ ఆచార్యులుగా సేవలందిస్తున్న జె.శ్రీనివాస రావు 'ఫైనాన్షియల్ ప్రెడిక్షన్స్–డు న్యూస్ అండ్ ఎమోషన్స్ మేటర్' అనే అంశంపై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం ఆచార్య జె.శ్రీనివాసరావు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో కార్యాలయంలో భేటీ అయ్యారు. వర్సిటీ తరపున ఆచార్య శ్రీనివాసరావును సత్కరించారు. ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమాల్లో మేయర్ దంపతులు


గణపతి హోమంలో పాల్గొన్న మేయర్ హరివెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులు

సీతంపేట: వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సీతంపేట దుర్గా గణపతి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున నిర్వహించిన గణపతి హోమం, పంచామృతాభిషేకం, సహస్ర నామార్చనలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు. విశేష పూజా కార్యక్రమాల అనంతరం దుర్గా గణపతిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. 25వ వార్డు వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో పవిత్రోత్సవాలు


పవిత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో పవిత్రోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజున అమ్మవారికి విశేష పూజలు చేశారు. ముందుగా విశ్వక్షేణ పుణ్యాహవచన, పవిత్ర అభిమంత్రణం, పుణ్యాహవచనం, మత్సంగ్రహణం, అంకురార్పణ, వాస్తు పురుష ఆరాధన, అంకురార్పణ, వాస్తు హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి శిరీష మాట్లాడుతూ ఈ నెల 27 వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు వెంకటరత్నం, సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహక ఇంజినీరు సీహెచ్‌వీ రమణ, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేయూత ఫౌండేషన్ సేవలు అభినందనీయం


నేత్ర వైద్య పరీక్షలు చేయించుకుంటున్న అదనపు కమిషనర్ శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్: నియోజకవర్గంలోని పేదలకు అందుబాటులో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన చేయూత ఫౌండేషన్ సేవలు అభినందనీయమని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు కొనియాడారు. మెడికవర్ హాస్పిటల్ సహకారంతో పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి వద్ద ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి నేత్ర వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వైద్య పరీక్షలు చేసుకున్న వారికి ఉచితంగా మందులు, కంటి వైద్య పరీక్షలు చేసుకున్న వారికి కళ్లజోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్య శిబిరాలు పేదలకు ఎంతో దోహదపడతాయన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమంలో తనను భాగస్వామ్యుడిని చేసినందుకు ఆనందంగా ఉందన్నారు. చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పీడికట్ల రాము మాట్లాడుతూ పూర్ణామార్కెట్ ప్రాంతంలో అనేక మంది నిరుపేదలు కనీసం ప్రాథమిక వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేకంగా బీపీ, సుగర్, ఈసీజీ, నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్, నేత్ర ఐ కేర్, వేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏవీఎన్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం


సూచనలిస్తున్న కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్

డాబాగార్డెన్స్: నగరంలోని ఏవీఎన్ కళాశాలలో ఆదివారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ప్రాధాన్యతను వివరించారు. సమాజానికి సేవ చేయడంపై, ప్రజలకు అవగాహన కల్పించడంపై వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి మాట్లాడుతూ విద్యార్థులు నిస్వార్థంగా సమాజానికి సేవ చేయాలని, పరిసరాలు పరిశుభ్రం చేసుకుంటూ అందరూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటరత్నం మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా ఎంతో అభివృద్ధి సాధించవచ్చన్నారు. నూతనంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా చేరిన పలువురు విద్యార్థులకు డాక్టర్ అర్చన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

'చాంద్ ఫిర్ నికలా' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ శశిప్రభ, డా.రఘురామరావు, రచయిత మల్లేశ్వరరావు

మహారాణిపేట: జిల్లా పరిషత్ సమీపంలోని అంకోసా సమావేశ మందిరంలో విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఆకాశవాణి రిటైర్డ్ ఉద్యోగి, రచయిత ఆకుల మల్లేశ్వరరావు రచించిన చాంద్ ఫిర్ నికలా పుస్తకాన్ని వైద్య, ఆరోగ్య శాఖ విశ్రాంత సంచాలకురాలు డాక్టర్ ఆర్.శశిప్రభ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావును శాలువా కప్పి సన్మానించారు. అనంతరం జాన్స్ మ్యూజిక్ అకాడమీ ప్రతినిధి ఏఎస్ జాన్ బృందం ఆధ్వర్యంలో హిందీ సంగీత విభావరి నిర్వహించారు. అలనాటి మధుర గీతాలను ఆలపించారు. అలనాటి హిందీ మధుర గీతాలను మల్లేశ్వరరావు చాంద్ ఫిర్ నికలా పేరుతో తెలుగులోకి అనువదించారు. విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంకోసా కార్యదర్శి డాక్టర్ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం


విద్యార్థిని నందినికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఉచిత ట్యూషన్ సెంటర్‌లో పదో తరగతి చదివి, ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న నిరుపేద విద్యార్థిని ఆర్.నందినికి పుస్తకాల కోసం వివేకానంద సంస్థ రూ.5 వేల ఆర్థిక సాయం అందజేసింది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా నగదు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువులు, వివిధ సమస్యలపై ఎమ్మెల్యే వెంటనే స్పందించి, తక్షణ సాయం అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం నందిని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కోశాధికారి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐవీఎఫ్‌పై అవగాహన అవసరం


సదస్సు ప్రారంభిస్తున్న డాక్టర్ సుధ, వైద్యులు

మహారాణిపేట: నగరంలో ఒక హోటల్‌లో ఐవీఎఫ్ సదస్సు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ ఐవీఎఫ్ నిర్వహణపై అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పద్మశ్రీ ఐవీఎఫ్ సెంటర్ ఎండీ డాక్టర్ సుధా పద్మశ్రీ, డాక్టర్ జి.సామినీ, డాక్టర్ ఎస్.అనురాధ, డాక్టర్ గీతావందన, డాక్టర్ ఆర్.విద్యా రమ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'శ్రీకృష్ణ రాయబారం'

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో ఆదివారం చింతలపాటి శూలపాణి(హైదరాబాద్) బృందం ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక పద్య నాటకం ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. ఇందులో మొదటి కృష్ణుడిగా చింతలపాటి రాజన్యలక్ష్మి, రెండో కృష్ణుడిగా చింతలపాటి శూలపాణి, దుర్యోధనుడిగా పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ, అర్జునుడిగా టి.దాలినాయుడు, బీఏ నాయుడు బృంద సభ్యులు పాత్రదారులుగా శ్రీకృష్ణ రాయబారంలోని శయన దృశ్యం, రాయబార దృశ్యాలతో హావభావాలతో రక్తికట్టించారు. సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో నాటకం జరిగింది.